



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వ ఇలా..



కొత్త కొత్తగా అంగన్‌వాడీలు



● అంగన్‌వాడీలలో విద్యార్థులను చేర్పించేందుకు ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

- ‘అమ్మమాట అంగన్‌వాడీ బాట’కు ప్రభుత్వం శ్రీకారం
- సామూహిక అక్షరాభ్యాసాలకు ఏర్పాట్లు
- జిల్లాలో ఐదు ప్రాజెక్టులు.. 1500 అంగన్‌వాడీ కేంద్రాలు

నిజామాబాద్ అర్బన్, జూలై 22: అంగన్‌వాడీలకు కొత్తశోభను తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రోత్సహించేందుకు నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులోలేని పూర్వ ప్రాథమిక విద్యను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందించేందుకు ‘అమ్మమాట-అంగన్‌వాడీ బాట’ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఐసీడీఎస్ సిబ్బంది అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. మొదటి దఫా శిక్షణ నెలరోజుల క్రితం పూర్తి కాగా రెండోదఫా శిక్షణ సోమవారం ముగిసింది. జిల్లా వ్యాప్తంగా ఐదు ప్రాజెక్టులలో 1500 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి.

‘అమ్మమాట-అంగన్‌వాడీ బాట’ ఇలా...

అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మేరకు ఈనెల 15, 16 తేదీలలో స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, యువత, తల్లిదండ్రుల సహకారంతో గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించారు. ఈనెల 18న ఇంటింటికి తిరిగి రెండున్నర ఏళ్ల వయస్సు ఉన్న చిన్నారులను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి అంగన్‌వాడీలలో బోధనపద్ధతులు వివరించి చిన్నారుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఐదేళ్లు పూర్తయిన పిల్లలకు అంగన్‌వాడీల నుంచి ప్రీ స్కూల్ సర్టిఫికెట్‌లను అందజేస్తారు. 19న అంగన్‌వాడీ కేంద్రాల్లో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించి మొక్కలు నాటే కార్యక్రమం, కిచెన్, గార్డెన్, మరుగుదొడ్లు, తాగునీరు సదుపాయాలు కల్పించడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈనెల 20న ఎర్లీ చైల్డ్ ఉడ్ కేర్ డెవలప్‌మెంట్ డేతో పాటు సామూహిక అక్షరాభ్యాసాలను నిర్వహించారు. పిల్లల తల్లిదండ్రులు, బంధువులు, తాత, నాన్నమ్మ, అమ్మమ్మలను ముఖ్య అతిథులుగా పిలిచి అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. బోధన పద్ధతులతో పాటు ఆట వస్తువులను ప్రదర్శించి వారికి వివరించారు.



చిన్నారుల ఎత్తు, బరువు చూస్తున్న ఆయాలు



సద్వినియోగం చేసుకోవాలి..



అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నూతన కార్యక్రమాన్ని చిన్నారులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలి. అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం జిల్లాలో కొనసాగుతోంది. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించడం ద్వారా పూర్వ ప్రాథమిక విద్యలో చిన్నారులకు చదువుపై ఆసక్తి పెరిగే అవకాశం ఉంది. ఆటపాటలతో కూడిన విద్యను చిన్నారులకు అందజేస్తాం.

– రసూల్‌బీ, జిల్లా మహిళా శిశుసంక్షేమ అధికారి

లక్షా 23వేల 511 మంది చిన్నారులు..

జిల్లాలో ఐదు ప్రాజెక్టుల పరిధిలో 1500 అంగన్‌వాడీలు ఉండగా వాటిలో లక్షా 23వేల 511 మంది చిన్నారులు ఉన్నారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, భీంగల్, డిచ్‌పల్లి ప్రాజెక్టుల పరిధిలో అంగన్‌వాడీలు కొనసాగుతున్నాయి. వీరిలో ఆరు నెలలోపు చిన్నారులు 8,565 మంది ఉండగా ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాలలోపు 60,776 మంది, 3 నుంచి 6ఏళ్లలోపు 54,170 మంది చిన్నారులు ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యలో విద్యార్థులను చేర్పించే కార్యక్రమాన్ని ఈనెల 15 నుంచి శ్రీకారం చుట్టారు. బాలబాలికలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పాలపిట్ట, తంగెడుపూలు, ప్రియదర్శని వాచకం పుస్తకాల ద్వారా పూర్వ ప్రాథమిక విద్యను బోధించనున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించేందుకు మంచి అవకాశం లభించనుంది. ప్రాథమిక విద్య కోసం చిన్నారులను నాలుగేళ్ల తర్వాతనే పాఠశాలల్లో చేర్పించాలని కేంద్ర ప్రభుత్వం నూతనంగా నిబంధనలు తీసుకువచ్చింది. దీంతో రెండున్నరేళ్ల, మూడేళ్ల నిండిన చిన్నారులను అంగన్‌వాడీలకు పంపించడమే ఉత్తమంగా తల్లిదండ్రులు భావిస్తున్నారు. నాలుగేళ్ల నిండిన తర్వాత పిల్లలను స్కూళ్లలో చేర్పిస్తే ప్రాథమిక విద్యను నేర్చుకునేందుకు ఇబ్బందులు పడే అవకాశం ఉందని అంగన్‌వాడీల ద్వారా పూర్వప్రాథమిక విద్యను నేర్చుకోవడం ద్వారా ప్రాథమిక విద్యను సులభంగా నేర్చుకునే అవకాశం ఉంటుందని ప్రభుత్వం చేపడుతున్న నూతన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ అధికారులు గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు.

ఆటపాటలతో బోధన..

అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యలో చిన్నారులకు ఆటపాటలతో కూడిన బోధనను నేర్పించనున్నారు. మంచి అలవాట్లతో పాటు ఆట వస్తువుల ద్వారాబోధన చేయనున్నారు. 3 నుంచి 4ఏళ్లలోపు చిన్నారులకు ఎల్‌కేజీ, 4 నుంచి 5 ఏళ్ల వారికి యూకేజీ విద్యాభ్యాసం చేయనున్నారు. అంగన్‌వాడీలకు చిన్నారులు వెళ్లడం ద్వారా ప్రాథమిక విద్యకు వెళ్లేసరికి చిన్నారులకు పాఠశాలలు అలవాటు అయ్యే అవకాశం ఉంటుంది. ఒకేసారి పాఠశాలకు వెళ్లేందుకు చిన్నారులు మారం చేయకుండా ఉండే అవకాశాలు ప్రాథమిక విద్య ద్వారా లబ్ధిపొందే అవకాశం ఉంది.

ఎస్సారెస్పీలోకి 20వేల క్యూసెక్కుల వరద

మెండోర, జూలై 22: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువన మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు ఈఈ చక్రపాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి నిజామాబాద్, నిర్మల్ జిల్లాల గోదావరి పరివాహక ప్రాంతాలలో కురిసిన వర్షాల కారణంగా ప్రాజెక్టులోకి 20023వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుందని తెలిపారు. దీంతో ప్రాజెక్టు ఈ సీజన్‌లో ప్రాజెక్టులోకి వరద ఎక్కువ రావడం ఇదే తొలిసారి. వర్షాభావం మరింత పెరిగి ప్రాజెక్టులోకి వరదనీరు భారీగా చేరి నిండుకుండలా మారాలని రైతన్నలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టులోకి ఆదివారం వదర నీరు 18000 క్యూసెక్కుల వరద రాగా సోమవారం 20వేల క్యూసెక్కుల నీరు చేరుతోంది. దీంతో కొత్త నీరు వరద నీరు చేరుతుండడంతో ఎస్సారెస్పీ జలకళను సంతరించుకుంటుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు (80టీఎంసీ)లు కాగా సోమవారం సాయంత్రానికి 1068.60అడుగులు (21.029టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని, గత ఏడాది ఇదే రోజున 1079.10అడుగులు (42.534టీఎంసీ)ల నీటి నిల్వ ఉందని పేర్కొన్నారు. జూన్ 1వ తేదీ నుంచి ప్రాజెక్టులోకి 15టీఎంసీల వరదనీరు వచ్చి చేరిందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

జిల్లాలో ముసురు వర్షం

నిజామాబాద్ అర్బన్, జూలై 22: జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు సోమవారం కాస్త బ్రేక్ పడింది. బంగాళ ఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ముసురు కురిసింది. జిల్లా వ్యాప్తంగా 5.49 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. జిల్లాలో అత్యధికంగా వర్ని మండలం జాకోరాలో 4.9 సెంటీమీటర్ల వర్షం, కోటగిరిలో 4.3 సెంటీమీటర్ల వర్షం, మోస్రాలో 3.7 సెంటీమీటర్ల వర్షం, రుద్రూర్‌లో 3.6, పోతంగల్‌లో 3.4, కమ్మర్‌పల్లిలో 3.4, చందూర్‌లో 3.3, ధర్పల్లిలో 2.2, మంచిప్పలో 2.6, గన్నారంలో 2.4 సెంటీమీటర్ల వర్షం నమోదైంది. జిల్లాలో సోమవారం సరాసరి వర్షపాతం 16.6 మిల్లీమీటర్లుగా నమోదైంది. దీంతో జిల్లాలోని చెరువులు, చెక్‌డ్యామ్‌లు, వాగులు వర్షం నీటితో కలకలలాడుతున్నాయి. మూడు రోజులుగా కురిసిన వర్షాలతో జిల్లాలో వరిసాగు కాస్త ఊపందుకుంది. ఈ సంవత్సరం వర్షాలు లేకపోవడంతో వరిసాగు కొంత నెమ్మదిగా సాగగా గత మూడు రోజులుగా కురిసిన వర్షాలతో వరి పంట వేయడం జోరందుకుంది. జిల్లాలో 21 మండలాల్లో ఎక్కువ, 12 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

ఎస్సారెస్పీలో 30 కిలోల చేప లభ్యం



డొంకేశ్వర్, జూలై 22: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారునికి సోమవారం భారీ చేప దొరికింది. మండలంలోని సిర్పూర్ గ్రామానికి చెందిన అభి అనే మత్స్యకారుడు రోజు మాదిరిగానే చేపల వేటకు వెళ్లాడు. 30కిలోల బరువుతో ఉన్న బోచ్చ రకానికి చెందిన చేప వలకు చిక్కడంతో అతని ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. సాధారణంగా గోదావరిలో ఐదు నుంచి పది కిలోల వరకు బరువు ఉన్న చేపలు పెరుగుతాయి. కానీ ఏకంగా 30కిలోల చేప దొరకడంతో మత్స్యకారుడు సంతోషం వ్యక్తం చేశాడు.





చెరువు మరమ్మతు పనులను చేపడుతున్న గ్రామస్థులు

మౌలాలీ చెరువుకు పొంచిఉన్న ముప్పు!



- అలుగు వద్ద రంధ్రం.. గండిపడే అవకాశం
- మరమ్మతులు చేపట్టని గుత్తేదారు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు
- గండిపూడ్చే పనుల్లో గ్రామస్థులు

శిథిలావస్థలో మౌలాలి చెరువు అలుగు

నిజామాబాద్ రూరల్, జూలై 22: రూరల్ మండలంలోని మల్కాపూర్ మౌలాలి చెరువుకు ప్రమాదం పొంచి ఉంది. భారీ వర్షాలతో శిథిలావస్థలో ఉన్న అలుగు మూలకు గండి పడే అవకాశం ఉంది. దీంతో మల్కాపూర్ తండా వాసులు ప్రమాదం బారిన పడనున్నారు. మౌలాలి చెరువు ఒక టీఎంసీ నీటినిల్వ సామర్థ్యం గలది. ఈ చెరువు దిగువన 550 మంది రైతులు వ్యవసాయం చేస్తున్నారు. ఈ ఆయకట్టు కింద 890 ఎకరాల వ్యవసాయ భూమి సాగవుతోంది. ఈ చెరువు నీటితోనే రైతులు తమ పంటలు పండించుకుంటున్నారు. వర్షాకాలంలో పెద్ద వర్షాలు కురిసిన ప్రతీసారి ఈ చెరువు నిండి అలుగు మత్తడి దుంకుతుంది. ఈ చెరువుకు దాదాపు వంద సంవత్సరాల చరిత్ర ఉంది. వందేళ్ల క్రితం మత్తడి (అలుగు) నిర్మించారు. చెరువునిండి నీరు అలుగు ద్వారా బయటకు వెళ్లిపోతుంది. అయితే వందేళ్ల క్రితం నిర్మించిన అలుగు శిథిలావస్థకు చేరుకుంది. అలుగు ఒక భాగంలో కిందివైపు నుంచి గండి పడనుంది. అక్కడున్న మట్టి, రాళ్ల క్రమంగా కిందికి జారిపోతున్నాయి. దాంతో వర్షపు తాకిడి పెద్దగా వస్తే రంధ్రం పడి చెరువు కోతకు గురికానుంది. దాంతో అలుగు చివరి భాగంలోని భూమి కోతకు గురవుతోంది. క్రమంగా కోతకు గుర్రై బుంగ (రంధ్రం) పడుతోంది.



పట్టించుకోని గుత్తేదారు

మౌలాలి చెరువు అలుగు మరమ్మతులు చేయాలని మల్కాపూర్ తండావాసులు అప్పటి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను కోరారు. దాంతో ఆయన రూ.18,50,000 నిధులు మంజూరు చేశారు. కాంట్రాక్టు పనులను గుత్తేదారు బత్తుల శ్రీనివాస్ దక్కించుకున్నారు. ప్రొసీడింగ్స్ కూడా ఇచ్చారు. అయితే గుత్తేదారు మరమ్మతు పనులు మాత్రం చేయడం లేదు. గ్రామస్థులు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి కలిసి సమస్య వివరించారు. ఎమ్మెల్యే ఆదేశించినా గుత్తేదారు పనులు చేయడం లేదు. వేసవికాలంలో చేయాల్సిన పనులు వర్షాకాలం వచ్చినా చేయలేదు. అటు ఇరిగేషన్ అధికారులు గానీ, ఇటు గుత్తేదారు కానీ స్పందించి పనులు చేయడం లేదు.

పొంచి ఉన్నప్రమాదం..

భారీ వర్షాలు కురిస్తే ఎగువ నుంచి వాన నీటితో మౌలాలి చెరువు నిండిపోతుంది. చెరువు నిండి అలుగు పారుతుంది. శిథిలావస్థలో ఉన్న అలుగు, మూలకు గండి పడితే చెరువు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. దాంతో చెరువులోని నీరు బయటకు వెళతాయి. నీటి ప్రవాహం పెరిగి చెరువులోని నీరు పల్లానికి వెళితే చెరువు కింద మూడ గ్రామాలున్నాయి. మల్కాపూర్ తండా, లింగితండా, ముత్తకుంట. ఈ మూడు గ్రామాలు నీట మునిగే ప్రమాదం పొంచివుంది.

గ్రామ పెద్దలు కలిసి..

మౌలాలి చెరువు తెగితే పెద్ద ప్రమాదం తప్పదని గ్రహించిన మల్కాపూర్ తండావాసులు చెరువు మరమ్మతులకు నడుంబిగించారు. అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిదుల నుంచి సైతం స్పందన లేకపోవంతో గ్రామస్థులే ముందుకు వచ్చారు. గ్రామంలోని నలుగురు కలిసి స్వంత డబ్బుతో అలుగు మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. తాజామాజీ సర్పంచ్ కెతావత్ ప్రకాష్ నాయక్, రావుజీ నాయక్, మోతీ నాయక్, దాదురాజు నాయక్‌లు ముందుకువచ్చారు. నలుగురు రూ.2లక్షల నిధులు జమచేశారు. మరమ్మతులకు కావాలసిన సిమెంట్, కంకర, ఇసుక తెప్పించి పనులను మేస్త్రీలతో చేశారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి మౌలాలి చెరువు మరమ్మతులు పూర్తిస్థాయిలో చేయాలని మల్కాపూర్ తండావాసులు కోరుతున్నారు.

అలుగు తెగిపోయే ప్రమాదం ఉంది..

: కెతావత్ ప్రకాష్, మల్కాపూర్ తండా

మౌలాలి చెరువు చాలా పాతది. అలుగు చివరన మట్టికొట్టుకుపోయి, రాళ్ల జరిగిపోయి రంధ్రం ఏర్పడుతోంది. మేం గమనించి తాత్కాలికంగా పూడ్చివేస్తున్నాం. మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డికి చెబితే, రూ.18లక్షల నిధులు మంజూరు చేశారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు పనులు చేయడం లేదు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి దృష్టికి తీసుకెళ్లాం. ఇరిగేషన్ అధికారులు పెద్దగా స్పందించడం లేదు. వరుసగా వర్షాలు కురిస్తే మాత్రం ప్రమాదం తప్పదు. చెరువుకింది పొలాలతోపాటు నీటి ప్రవాహానికి మూడు గ్రామాలు నీట మునిగిపోతాయి.

మేమే మరమ్మతులు చేపట్టాం..

: మోతీనాయక్, మల్కాపూర్ తండా

మా ఊరి పెద్ద చెరువు ప్రమాదంలో ఉంది. దీని గురించి అధికారులు పట్టించుకుంటలేరు. పనులు తీసుకున్న కాంట్రాక్టర్ పనిచేయడం లేదు. పెద్ద వర్షాలు పడితే చెరువు అలుగుకు గండి పడే ప్రమాదం ఉంది. చివరికి మేం నలుగురుం కలిసి స్వంత డబ్బులు వేసుకుని రిపేర్ చేశాం.

పనులు త్వరగా చేయమని సూచించాం..

: బాలరాజు, డీఈ ఇరిగేషన్

మౌలాలి చెరువు మరమ్మతుల కోసం పద్దెనిమిదిన్నర లక్షల నిధులు మంజూరయ్యాయి. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు సకాలంలో నాణ్యతతో పనులు చేయాలని గతంలో సూచించాం. చెరువుకు ప్రమాదం ఉందని మాజీ సర్పంచ్ కేతావత్ ప్రకాష్ పలుమార్లు నాకు ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టర్‌కు గట్టిగా చెప్పి చూశాం. త్వరలోనే చేస్తానని హామీ ఇచ్చాడు. ఆయన చేయకపోతే మరొకరికి పనులు అప్పగిస్తాం.

బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో శిశువు మృతి

- వైద్యుల కొరతే శిశువు మృతికి కారణమని బంధువుల ఆందోళన
- ఆర్డీవో కార్యాలయం ఎదుట శిశువు మృతదేహంతో ధర్నా

బోధన్‌రూరల్, జూలై 22: బోధన్ ప్రభుత్వాసుపత్రిలో సోమవారం ఓ శిశువు మృతి చెందింది. ఇందుకు వైద్యుల కొరతతో పాటు ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ శిశువు మృతదేహంతో కుటుంబ సభ్యులు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రహీషా ఫిర్దోస్ అనే మహిళ సోమవారం కాన్పు కోసం ఆస్పత్రికి వచ్చిందన్నారు. అయితే వైద్యులు లేకపోవడంతో అక్కడ ఉన్న సిబ్బంది సాధారణ కాన్పు కోసమని చెప్పి గంటల తరబడి ఆలస్యంగా చేశారన్నారు. ఆ తర్వాత నిజామాబాద్‌కు తీసుకెళ్లాలని చెప్పారని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి శస్త్ర చికిత్స నిర్వహించగా.. మగ శిశువు మృతి చెందాడని తెలిపారు. అయితే శిశువు మృతికి బోధన్ ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల కొరతే కారణమని ఆరోపిస్తూ.. మహిళ కుటుంబీకులు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. వెంటనే ప్రభుత్వాసుపత్రిలో ప్రసూతి వైద్యురాలితో పాటు పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆందోళనకారులకు నచ్చచెప్పడంతో.. వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.



శిశువు మృతదేహంతో అధికారులతో మాట్లాడుతున్న బంధువులు



బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట శిశువు మృతదేహంతో ధర్నా చేస్తున్న కుటుంబీకులు

కాంగ్రెస్ ప్రభుత్వం మాటతప్పితే పోరాటం తప్పదు

● సీఐటీయూ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు



ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పెద్దబజార్, జూలై 22: కాంగ్రెస్ ప్రభుత్వం మాటతప్పితే పోరాటం తప్పదని సీఐటీయూ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు హెచ్చరించారు. సోమవారం నగరంలోని ధర్నాచౌక్ వద్ద ఆశావర్కర్ల సమస్యలపైన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశావర్కర్లకు 15 రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు కాంగ్రెస్ ప్రభు త్వం తన మేనిఫెస్టోలో పొందుపర్చిన హామీలు 2024 ఫిబ్రవరి 9న ఆరోగ్య శాఖ కమిషనర్‌కు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కనీస వేతనం 18వేల రూపాయలు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా, రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్ తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. 2023 సెప్టెంబరు 25 నుంచి అక్టోబర్ 9 వరకు రాష్ట్ర వ్యాప్తంగా 15 రోజులు ఆశావర్కర్లు సమ్మె చేశారని అన్నారు. అనంతరం వైద్య అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్, యూనియన్ నాయకులు విజయ, రేణుక, సుకన్య, రమ, లలిత, రేవతి, భూలక్ష్మి, సౌజన్య పాల్గొన్నారు.



ఆస్పత్రిలో పేషెంట్‌తో మాట్లాడుతున్న బృందం సభ్యులు

జిల్లా ఆస్పత్రిని సందర్శించిన ఢిల్లీ బృందం

పెద్దబజార్, జూలై 22: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఢిల్లీ నుంచి నలుగురు సభ్యులతో కూడిన బృందం సోమవారం సందర్శించింది. ఈ సందర్భంగా ప్రతీ విభాగాన్ని తనిఖీ చేస్తూ ఇన్ఫెక్షన్ వ్యాపించకుండా తీసుకుంటున్న జాగ్రత్తల గురించి సానిటేషన్ వర్కర్లను, పేషంట్లను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్‌తో టీబీ వార్డు, ల్యాబ్, బ్రోంబస్కోప్, ఓపీ విభాగాల వద్ద ఎయిర్‌బోన్ ఇన్ఫెక్షన్ కంట్రోల్ మార్గదర్శకాల ప్రకారం పాటించాల్సిన పద్ధతుల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమరాజ్, బృందం వైద్యులు భరత్, పార్థసారథి, జావిద్, ప్రమోద్‌రెడ్డి, హెచ్‌వోడీ డీవీవీ రావు, ఉదయ్‌కృష్ణ, జిల్లా టీబీ కోఆర్డినేటర్ రవిగౌడ్, రమ్య పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల్లో కొనసాగుతున్న తనిఖీలు



గోదామును పరిశీలిస్తున్న సివిల్ సప్లయిస్ అధికారులు

బోధన్‌రూరల్, జూలై 22: మండలంలోని మినార్‌పల్లి ఎక్స్‌రోడ్డు సమీపంలో గల గోదాములలో సోమవారం జిల్లా సివిల్ సప్లై డీఎం వైపీ.రమేష్‌తో కూడిన బృందం తనిఖీలు నిర్వహించింది. సీజన్‌లలో కేటాయించిన ధాన్యం నిల్వలు పరిశీలిస్తున్నామని అధికారి వెల్లడించారు. మూడు రోజుల క్రితం ఈ గోదాంలో తనిఖీ నిర్వహించామని మరోసారి తనిఖీలు నిర్వహించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. గత సీజన్‌లో రైస్ మిల్లుకు కేటాయించిన ధాన్యం నిల్వల రికార్డులను అధికారులు పరిశీలించారు. నిల్వలు సక్రమంగా ఉన్నాయా లేదా అనే కోణంలో అధికారుల తనిఖీలు కొనసాగాయి. రైస్ మిల్లులు తమకు కేటాయించిన ధాన్యాన్ని సక్రమంగా ఎఫ్‌సీఐకి బియ్యంలో అందించాలని అధికారులు రైస్‌మిల్లు యాజమానులకు సూచించారు. రైస్‌మిల్లులోని నిల్వల నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు రుద్రూర్ సీఐ జయేష్ రెడ్డి, డీటీ వినోద్ కుమార్, కోటగిరి తహసీల్దార్ సునీత, సివిల్ సప్లై టెక్నికల్ అసిస్టెంట్ రాజేష్, తదితరులున్నారు.

బీడీ కార్మికులందరికీ ప్రభుత్వం జీవన భృతి కల్పించాలి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, జూలై 22: బీడీ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులతో పాటు బీడీలు చేసే ప్రతి మహిళకు ప్రభుత్వం జీవన భృతి చెల్లించాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు మల్లేష్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని మహలక్ష్మి ఆలయం నుండి ఆర్డీవో కార్యాలయం వరకు బీడీ కార్మికులు, మహిళతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బీడీ కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని, ఎన్నికలలో ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ప్రతి మహిళకు 2500రూపాయల పింఛన్, వృద్ధులకు 4వేల రూపాయల పింఛన్ ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఇచ్చిన మాట ప్రకారం వాటిని అమలు చేయాలన్నారు. బీడీలు చుట్టే కార్మికులే కాకుండా బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవించే ప్యాకర్లు, ఇతర సిబ్బందికి ఎటువంటి షరతులు లేకుండా జీవన భృతి కల్పించాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు 4016రూపాయల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పడాల శంకర్, సుల్తాన్ సాయిలు, ధ్యాకం పోశెట్టి, నాగమణి, గంగామణి, శోభ పాల్గొన్నారు.

‘దివ్యాంగులను కించపర్చేలా వ్యాఖ్యలు చేయడం సరికాదు’

బోధన్‌రూరల్, జూలై 22: సమాజంలో దివ్యాంగులను కించపర్చేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ డిమాండ్ చేశారు. సోమవారం బోధన్ ఏసీపీ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీనియర్ అధికారిగా కొనసాగుతున్న ఐఏఎస్ స్మితాసబర్వాల్ ఓ సోషల్ మీడియాలో దివ్యాంగులను అవమానపర్చేలా వ్యాఖ్యలు చేశారని ఆమె ఆరోపించారు. దివ్యాంగులు విమానాలు, శస్త్రచికిత్సలు సరైన పద్ధతిలో చేయగలరా తగు సామర్థ్యాలు లేని వారిని ఆలిండియా సర్వీస్‌లలో ఎలా తీసుకుంటారని అవమానకర పదజాలంతో కించపర్చే వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. దివ్యాంగుల రిజర్వేషన్ గురించి మాట్లాడాడమంటే భారత రాజ్యాంగాన్ని కించపర్చినట్లు అని ఆమె పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మాట్లాడిన వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

పంట పొలాల పరిశీలన



టాక్లీ శివారులో పంట పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కోటగిరి,జూలై22: గత వారం రోజుల నుండి కురుస్తున్న వర్షాలతో ఆరుతడి, వరిపంటలపై తీవ్ర ప్రభావం చూపుతుండడంతో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శాస్త్రవేత్తలు తగిన సలహాలు, సూచనలు అందజేశారు. కోటగిరి ఉమ్మడి మండలంలోని టాక్లీ, సోంపూర్, దోమలెడ్గి, ఎత్తొండ గ్రామాలలోని వ్యవసాయ పంటలను సోమవారం ప్రాంతీయ చెరకు, వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు క్షేత్ర సందర్శన చేశారు. సోయ, చిక్కుడులో నీరు నిల్వ ఉండడాన్ని గమనించారు. సోయా పంట లేత పసుపు వర్ణంలోకి మారినట్లుగా గుర్తించారు. సోయా పంటలో నీటిని బయటకు తీసివేయాలని రైతులకు సూచించారు. 191919ఎరువును 10గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు, శాస్త్రవేత్తలు నరేందర్, కృష్ణ చైతన్య, దినేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి'

రెంజల్,జూలై22: ప్రతి ఒక్కరు తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. సోమవారం రెంజల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సాయన్నతో కలిసి వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత కూడా వారిపైనే ఉందని, జీవకోటి మనుగడకు మొక్కలు ఎంతగానో ఉపయోగపడతాయని, మొక్కలు లేకపోతే మానవ మనుగడ లేదని అన్నారు. నేడు నాటిన మొక్కలే రేపు మహ వృక్షాలుగా మారి అందరికి ప్రాణవాయువుగా ఉపయోగపడుతుందన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాసజేందర్ రావు, ఏపీవో రమణ, ఫీల్డ్ అసిస్టెంట్ శోభన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పునాది దశలోనే నిలిచిపోయిన మార్కెట్ నిర్మాణం

● నిధుల కొరత వల్లే పనుల్లో జాప్యం

ఆర్మూర్‌రూరల్, జూలై22: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ప్రధాన రహ దారి పక్కనే నిర్మిస్తున్న వెజ్ అండ్ నాన్ వెజ్ (సమీకృత) మార్కెట్ పునాది దశలోనే నిలిచిపోయింది. అన్ని హంగులతో అందరికి సౌకర్యంగా మార్కెట్ నిర్మించాలన్న ఉద్దేశంతో అప్పటి ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి రూ.7 కోట్ల 20లక్షల ప్రత్యేక నిధులు మంజూరు చేయించారు. అనంతరం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం పెర్కిట్ లోని 44, 63వ జాతీయ రహదారి కూడలి పక్కన ఇరుకు స్థలంలో మార్కెట్ నిర్మిస్తున్నారు.ఈమార్కెట్‌ను తరలించి అన్ని హంగులతో నూతన మార్కెట్ నిర్మించా లని ఆర్ అండ్‌బీ కార్యాలయ స్థలంలో పనులు ప్రారంభించారు.

● ఆదాయం ఉన్నా వసతులు కరువు

పెర్కిట్‌లోని ప్రస్తుతం బస్టాండ్ సమీపంలో అంతర్గత రోడ్డుకు ఇరువైపులా ప్రతీరోజు కూరగాయల మార్కెట్ నిర్వహిస్తున్నారు. ఆర్మూర్ ప్రాంతంలోని వివిధ మండలాలతో పాటు వివిధ గ్రామాల రైతులు, నిర్మల్ జిల్లా రైతులు సైతం తాము పండించిన కూరగాయలను పెర్కిట్ మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. దూర ప్రాంతం నుంచి కూరగాయలు తీసుకువచ్చే విక్రయించినట్టు విక్రయదారులతో పాటు వినియోగదారులతో మార్కెట్ నిత్యం రద్దీగా ఉంటుంది. పేరుకు పెద్ద మార్కెట్ అయిన వసతులు కరువై ప్రజలు, వ్యాపారులు అవస్థలు పడుతున్నారు. మార్కెట్‌లో ప్రజలు, వినియోగదారులు ఎండకు, వానకు ఇబ్బందులుపడాల్సిందే తప్ప షెడ్ల నిర్మాణం లేకపోవడంతో అసౌకర్యంగా మారింది. దీంతో గత పాలకులు మార్కెట్‌ను తరలించి అన్ని హంగులతో వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మిస్తామని హామీ ఇచ్చి నిధులు మంజూరు చేయించారు. ప్రారంభమైన పనులు మాత్రం పిల్లర్ల దశలోనే ఆగిపోయాయి. ఆర్మూర్ మున్సిపాలిటీకి మార్కెట్ వల్ల ఆదాయం వస్తున్న కనీస సౌకర్యాలు మాత్రం కల్పించడంలేదని విమర్శలు వస్తున్నాయి. మామిడిపల్లి గ్రామపంచాయతీ వద్ద పెర్కిట్‌లో రెండు చోట్ల మార్కెట్‌ను నిర్వహిస్తున్నారు. మార్కెట్‌ల నిర్వహణ ద్వారా మున్సిపాలిటీకి లక్షల్లో ఆదాయం సమకూరుతుంది. గత నెలలో ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో తైబజార్ వేలం నిర్వహించగా తొమ్మిది నెలల కాలానికి రూ.22.86లక్షలకు గుత్తేదారు తక్కించుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న వెజ్ అండ్ నాన్‌వెజ్ (సమీకృత) మార్కెట్‌ను తొందరగా నిర్మించి తమ సమస్యలను దూరం చేయాలని విక్రయ వినియోదారులు కోరుతున్నారు.



పెర్కిట్‌లో పిల్లర్ల దశలోనే నిలిచిన మార్కెట్ పనులు

నిధుల కొరత వల్లే పనులు నిలిచిపోయాయి

పెర్కిట్‌లో వెజ్ అండ్ నాన్ వెజ్ సమీకృత మార్కెట్ భవనం నిర్మిస్తున్న గుత్తేదారుకు డబ్బులు రాకపోవడంతో పనులు నిలిచిపో యాయి. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టి మార్కెట్ నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

\- రాజు, మున్సిపల్ కమిషనర్

కేజీబీవీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని వినతి



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేసిన పీడీఎస్‌యూ నాయకులు

ఆర్మూర్‌రూరల్,జూలై22:ఆర్మూర్‌మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో కస్తూర్బా బాలికల పాఠశాలలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం.నరేందర్ మాట్లాడుతూ కేజీబీవీలో సుమారు 400మందికి విద్యార్థినులకు విద్యనభ్యాసిస్తున్నారని వారికి అన్ని వసతులు కల్పించాలన్నారు. వర్షకాలంలో పాఠశాల ప్రాంగణం బురదమయమై మరోవైపు నీరు నిలిచి ఉంటుందని గతంలో ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు.పాఠశాల ఆవరణలో పరిసరాలను పరిశుభ్రం చేయాలని,దోమలు వ్యాప్తి చెందకుండా అన్నిచర్యలు తీసుకోవాలని వారు కోరారు. సమస్యను పరిష్కరించని పక్షంలో ఆందోళన చేపతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ప్రధానకార్యదర్శి నిఖిల్, జంపన్న, బార్గవ్, నిఖిల్, అఖిల్, శ్రీకాంత్, ముకేష్, రాజా, శివ, గంగప్రసాద్‌లు పాల్గొన్నారు.

డిగ్రీ వన్‌టైం పరీక్షల్లో ఒకరు గైర్హాజరు

డిచ్‌పల్లి,జూలై 22: తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ బ్యాక్‌లాగ్ వన్‌టైం పరీక్షలు సోమవారం 20వరోజు ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు.అనుబంధ కళాశాల పరిధిలో ఉదయం జరిగిన పరీక్షకు ముగ్గురు విద్యార్థులకు గాను ముగ్గురు హాజరయ్యారని, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 22మంది విద్యార్థులకు గాను 21 పరీక్షకు హాజరయ్యారని, ఒకరు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

పొతంగల్‌లో ఇసుక డంప్ సీజ్

కోటగిరి,జూలై22: పొతంగల్ మండలంలోని మంజీర వాగు సమీపంలో సోమవారం 12ట్రిప్పుల ఇసుక డంప్‌ను సీజ్ చేసినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. మంజీర వాగు సమీపంలో వీరభద్ర గుడి వద్ద ఇసుక డంప్ ఉన్నట్లు తమకు సమాచారం అందడంతో సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. త్వరలోనే ఇసుక డంప్‌కు వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇసుకను డంప్ చేసిన, అక్రమ రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

పీజీ ఇంటిగ్రేటెడ్ బ్యాక్‌లాగ్ పరీక్షల తేదీలు విడుదల

డిచ్‌పల్లి, జూలై 22: తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని పీజీ ఇంటిగ్రేటెడ్ కోర్సుకు చెందిన బ్యాక్‌లగ్ పరీక్షల కు చెందిన షెడ్యూల్ విడుదల చేయడం జరిగిందని సీవోఈ ప్రొ.అరుణ తెలిపారు.ఎంఏ,ఎంకాం, ఎంఎస్ డబ్ల్యూ, ఎంఎస్సీ, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, 5ఏళ్ల ఇంటిగ్రేటెడ్ ఏపీఈ, ఐపీసీ హెచ్, ఐఎంబీఏ, 1,3,4,7,9 వసెమిస్టర్ బ్యాక్‌లగ్ పరీక్షలు జూలై 31నుంచి ప్రారంభమై ఆగస్టు 14వరకు జరుగుతాయని సీవోఈ అరుణ తెలిపారు. పూర్తి వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్ సంప్రదించలన్నారు.

అమ్దాపూర్‌లో అదనపు తరగతులను నిర్మించాలి

బోధన్‌రూరల్,జూలై22: బోధన్ మండలంలోని అమ్దాపూర్‌లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం అదనపు తరగతులను నిర్మించాలని గ్రామస్థులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయ భవన నిర్మాణం అర్థంతరంగా ఆగిపోవడం జరిగిందని తక్షణమే పనులు మొదలు పెట్టాలని కలెక్టర్‌ను కోరారు. హాస్టల్‌లో విద్యార్థినులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు సిర్ప సుదర్శన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నవీపేట,జూలై22: మండలంలోని మోకన్‌పల్లి పంచాయతీ పరిధిలోని అంజుమాన్ ఫారంలో సోమవారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమా మహేశ్వర్ రావు, రామకృష్ణ, కాంత్, కే.వెంకటేశ్వర్ రావు, భద్రి, నర్సాగౌడ్, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని వినతి

మోస్రా,జూలై22: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తాం అని కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ ద్వారా హామీలు ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 6నెలలు గడుస్తున్న ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం సిగ్గు చేటు బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి అని ఈ రోజు బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో మోస్రా మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి తహసీల్దార్ కార్యాలయంలో గిర్దావర్ ప్రకాష్‌కు మెమోరాండం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సంగా అనిల్, మండల ప్రధాన కార్యదర్శి కోమిరి సాయిలు, మాజీ ఉప సర్పంచ్ సుదర్శన్‌గౌడ్, సొసైటీ డైరెక్టర్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మండల కార్యదర్శి హనుమాగౌడ్, యోగి, శ్రీను, భరత్ గౌడ్, పాల్గొన్నారు.

వర్ని: రాష్ట్రంలో 23శాతంగా ఉన్న బీసీ డిక్లరేషన్ రిజర్వేషన్‌ను 42 శాతంగా అమలు చేయాలని రాష్ట్ర ఓబీసీ మోర్చ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వర్ని తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి బీసీలను విస్మరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గొల్ల కుర్మలకు లక్ష రూపాయలు రుణం ఇస్తామని హామీ ఇచ్చి ఆ మాటనే మర్చారని విమర్శించారు. ఎంబీసీ కులాలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దొరబాబు, మండల శాఖ అధ్యక్షులు శంకర్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గంగాధర్, రాజు పాల్గొన్నారు.



కోటగిరిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నవీపేట: రాష్ట్ర ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని కోరుతూ సోమవారం బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్ నారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు శివప్రసాద్, బీజేపీ మండల అధ్యక్షుడు సరిన్, వంశీ మోహన్, శ్రీనివాస్‌గౌడ్, గణేష్, రాము, ఆనంద్, రాజేందర్‌గౌడ్, రాజశేఖర్, రాధ తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయడంలో కాలయాపన చేయడంపై ఓబీసీ యువమోర్చా నియోజకవర్గ నాయకులు నాగం సాయిలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బీసీ డిక్లరేషన్ కాలయాపనను నిరసిస్తూ కోటగిరి, పొతంగల్ తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: ఎన్నికల సమయంలో కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని కోరుతూ సిరికొండలో ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు తహసీల్దార్ రవీందర్‌రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి,కిసాన్‌మోర్చ మండల ఆధ్యక్షుడు బాబురావు,ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు శంకర్, మాలోత్‌రాజేందర్,ఎస్. గోపి, సాయగౌడ్,మారుతీ,అజయ్,కిరన్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్:పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించి తహసీల్దార్ గజానన్‌కు మెమోరాండం అందజేశారు. ఈసందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు యామాద్రిబాస్కర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీల ప్రకారం బీసీలకు కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్‌లు కల్పించాలని, గొల్లకుర్మలకు అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో లబ్దిదారులకు గొర్రెల పంపిణీకి సంబంధించి రూ.2లక్షలు వారి అకౌంట్‌లో జమ చేయాలని, బీసీ సబ్‌ప్లాన్‌కు తగిన నిధులు మంజూరు చేయాలని, ఎంబీసీ కులాలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రధానకార్యదర్శి జీవీ.నర్సిం హరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధులు కలిగోట గంగాధర్, జెస్సు అనిల్, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్; బాశెట్టి రాజ్‌కుమార్, ఆకుల శ్రీనివాస్, పొల్కం వేణు, పులి యుగంధర్, కేసీ ముత్తెన్న, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో కామారెడ్డిలో ఇచ్చిన హామీ మేరకు బీసీ గణన చేపట్టాలని ముప్కాల్ మండల కేంద్రంలో బీజేపీ ఓబీసీ మోర్చ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో బీసీ మండల అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి,నర్సయ్య,కెఎంరెడ్డి,గంగాధర్,దినేష్,సాగర్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి : ఎస్సై

డొంకేశ్వర్, జూలై22 : సైబర్‌నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండి స్మార్ట్ ఫోన్‌లో తెలియని లింకులు ఓపెన్ చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై రాహుల్ అన్నారు. సోమవారం డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి, గంగాసరం గ్రామాలలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ వ్యక్తిగత వివరాలకు ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. బ్యాంకు లోగోలతో వచ్చిన లింకులను యాప్స్‌ను ఓపెన్ చేయకూడదని కోరారు. సైబర్ నేరాలు గురైనప్పుడు 1930నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. సైబర్ క్రైం గురైన వెంటనే ఫిర్యాదు చేయాలని కోరారు. స్మార్ట్ ఫోన్‌లో లింకులు క్లిక్ చేయకుండా జాగ్రత్త ఉన్నట్లయితే సైబర్ నేరాల జరుగకుండా అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ రాములు, రాజేశ్వర్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

ముప్కాల్, జూలై22: బాల్కొండ, ముప్కాల్ మండలాల్లోని అన్ని గ్రామాల రైతులు ఈ సంవత్సరం నూతనంగా పట్టాపాస్ పుస్తకాలు పొందిన రైతులు, ఇది వరకు రైతు బీమా చేసుకొని రైతులు రైతు బీమాకు సంబంధించి దరఖాస్తులు వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారులు మహేందర్, రాజ్‌కుమార్ తెలిపారు. 18 నుంచి 59ఏళ్లు ఉండి అర్హత కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గత సంవత్సరం ఆగస్టు నుంచి ఈ సంవత్సరం జూన్ 28వ తేదీ వరకు కొత్తపాస్‌పుస్తకాలు పొందిన రైతులు రైతు బీమా దరఖాస్తు చేసుకోవాలని, గతంలో పట్టాపాస్‌బుక్ పొంది ఇంత వరకు బీమాకు దరఖాస్తు చేసుకోని రైతులు నామిని వివరాలు ఏమైనా మార్చుకోవాలన్నా ఏఈవోను కలిసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతుబీమా దరఖాస్తు కోసం బీమా అప్లికేషన్ ఫాం, పట్టాపాస్‌బుక్ జిరాక్స్, రైతు ఆధార్‌కార్డు జిరాక్స్, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్‌లో జత చేయాల్సి ఉంటుందని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ముప్కాల్, జూలై 22: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ సీహెచ్. మురళీ తెలిపారు. సోమవారం బాల్కొండ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పిల్లలకు ప్రస్తుతం వర్షాకాలం సీజనల్ వ్యాధులైన మలేరియా, డయేరియా, కలర, డెంగ్యూ వంటి వ్యాధులు రాకుండా చేపట్టేచర్యలను వారికి వివరించారు. పాఠశాలలో మధ్యాహ్నబోజన పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు చేతులు కడిగే పద్దతి గురించి వారికి వివరించారు. కార్యక్రమంలో రాజు, సుజాత, ఎఎన్ఎంలు, ఆశవర్కర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని వినతి

ఆర్మూర్‌రూరల్, జులై 22 : బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని కోరుతూ సోమవారం ఆలూర్ మండల కేంద్రంలోని తహసీలార్‌కు బీజేపీ శ్రేణులు వినతిపత్రం అందజేశాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు బండారి యాదగిరి మాట్లాడుతూ కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని, దానిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు నాడిశరం మల్లయ్య, మండల అధ్యక్షుడు కొత్తూరు గంగాధర్, ఉపాధ్యక్షుడు రమేష్, ప్రళయ్‌తేజ్, లోక రాంరెడ్డి, సురేష్‌గౌడ్, హరిష్, నాగేంధర్, శ్రీకాంత్, నరేష్, ప్రణీత్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

కన్నుల పండుగగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

డిచ్‌పల్లి,జూలై 22: మండలంలోని ధర్మారం (బీ) వేంకటేశ్వర ఆలయంలో సోమవారం శ్రావణ నక్షత్రం సందర్భంగా శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి కల్యాణ కార్యక్రమం వైభవోపేతంగా నిర్వహించారు. స్వామి వారికి పట్టువస్త్రాలు తలంబ్రాలు, రావుల బ్రహ్మానందం దంపతులు సమర్పించారు. కల్యాణోత్సవ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆశాఢ మాసంలో స్వామి వారి కృప అందరికి కలగలని ప్రతి యేటా కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వర్గీకరణ సాధన కోసం ఛలో ఢిల్లీకి తరలిరావాలి

● ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు రమేష్‌కుమార్

సుభాష్‌నగర్, జూలై 22: వర్గీకరణ సాధన కోసం మాదిగలందరూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించతలపెట్టిన ధర్నా కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలిరావాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు రమేష్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హాల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఛలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధనతోనే మాదిగలకు వారి ఉప కులాలకు అన్ని విధాల న్యాయం జరుగుతుందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే వందరోజుల్లో వర్గీకరణ బిల్లు పెడతామని హామీలు ఇచ్చారని హామీలు నీటిమూటలుగానే మిగిలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీవర్గీకరణ బిల్లు ప్రవేశ పెట్టి చట్టబద్దత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 10, 11 తేదీల్లో జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమానికి తరలిరావాలన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

'పోడు' సమస్యలపై శాసనసభలో చర్చించాలి'

● పోడుభూముల సాధన కమిటీ

బోధన్‌రూరల్, జూలై 22 : పోడు రైతుల సమస్యలపై శాసనసభలో చర్చించాలని పోడుభూముల సాధన కమిటీ సభ్యులు సోమవారం బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సాధన కమిటీ నాయకులు నన్నేసాబ్ మాట్లాడుతూ బోధన్ డివిజన్‌లోని చందూర్ తదితర మండలాల్లోని గ్రామాలలో గిరిజనేతర నిరుపేద రైతులు గత 30 సంవత్సరాలుగా పోడుభూములు సాగు చేసుకుని జీవిస్తున్నారని, అర్హులైన నిరుపేద పోడు రైతులకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం గిరిజనులకు పట్టాలు ఇచ్చి గిరిజనేతరులకు మొండి చేయి చూయించిందని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి పోడు భూములకు పట్టాలు ఇస్తామని ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. శాసన సభ సమావేశాల్లో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పోడు రైతుల సమస్యలపై గళం ఎత్తాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు సాయిబాబా, వెంకన్న, సాయిలు, శ్రీను, సాయి, గంగారాం తదితరులున్నారు.

మున్సిపల్ కార్మికులకు షూస్ పంపిణీ

ఆర్మూర్‌టౌన్, జూలై 22: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్‌చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ సోమవారం కార్మికులకు బ్లౌజెస్, షూస్‌లు పంపిణీ చేశారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా కార్మికుల సందర్శనార్థం అప్రన్స్ బ్లౌజెస్, షూస్ పంపిణీ చేసినట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ షేక్‌మున్నా, మున్సిపల్ కమిషనర్ రాజు, డీఈ భూమేశ్వర్, కౌన్సిలర్ ఆకుల రాము, తదితరులు పాల్గొన్నారు.

బీమాకు దరఖాస్తులు చేసుకోండి

● కమ్మర్‌పల్లి మండల వ్యవసాయాధికారి అబ్దుల్‌మాలిక్

కమ్మర్‌పల్లి, జూలై 22 : జూన్ 28 వరకు నూతనంగా పట్టేదార్ పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతుబీమా పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని కమ్మర్‌పల్లి మండల వ్యవసాయాధికారి అబ్దుల్‌మలిక్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతు గతంలో రైతు బీమా చేయించుకున్న రైతులు తప్పొప్పులను మార్పుటు చేర్పులను సరిచేయించుకోవడానికి ఈనెలాఖరువరకు అవకాశం ఉందన్నారు. నూతనంగా పట్టేదార్ పాసుపుస్తకం పొందిన రైతులు దరకాస్తు ఫారం, రైతుల పట్టేదార్ పాసుపుస్తకం లేదా తహసీల్దార్‌తో డిజిటల్ సంతకంతో డీఎస్ఆర్ పేపర్, రైతు ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు అందజేయాలన్నారు. 14 ఆగస్టు 1965 నుంచి 14 ఆగస్టు 2006 మధ్య పుట్టిన రైతులు మాత్రమే ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఆధార్ కార్డులో 18 సంవత్సరాలు నుండి 59 సంవత్సరాల వయస్సు ఉన్న రైతులు మాత్రమే రైతుబందుకు దరకాస్తులు చేసుకోవాలన్నారు. తమ దరకాస్తులను తమతమ గ్రామాలకు చెందిన వ్యవసాయవిస్తీరణ అధికారులు (ఏఈవోలకు) అందజేయాలని అన్నారు.

భారీ వర్షానికి దెబ్బతిన్న నాలుగు ఇళ్లు

నవీపేట, జూలై22 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో నాలుగు ఇళ్లు దెబ్బతిన్నాయని తహసీల్దార్ నారాయణ తెలిపారు. మండల కేంద్రంలోని దర్యాపూర్‌లో రెండు, నవీపేటలో ఒకటి, ఫత్తేనగర్‌లో ఒకటి చొప్పున ఇళ్లు దెబ్బతిన్నాయని అన్నారు. బాధిత కుటుంబాలను ఒక్కొక్కరికి 3200చొప్పున పరిహారాన్ని అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ల ఆయిల్ చోరీ

నవీపేట,జూలై22: మండల కేంద్రంలోని భట్టువాలా బాగ్ సమీపంలో ఆదివారం రాత్రి రెండు ట్రాన్స్‌ఫార్మర్ల ఆయిల్ చోరీకి గురైందని ట్రాన్స్‌కో ఏడీ సుహాసిని తెలిపారు. గుర్తు తెలియని దుండగులు 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్ నుండి 250 లీటర్లు, 63కేవీ ట్రాన్స్‌ఫార్మర్ నుండి 200లీటర్ల ఆయిల్‌ను ఎత్తుకెళ్లారని ఆమె పేర్కొన్నారు. ఈ చోరీ విషయంపై నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

శివాలయంలో హుండీ లెక్కింపు

బోధన్‌రూరల్, జూలై 22 : బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలోని శివాయలంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహించగా 1,09,421 భక్తుల ద్వారా హుండీలో లభించినట్లు దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కమల తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రాములు, వేద పండితులు గణేష్ మహరాజ్, ఈవో రవీందర్ గుప్తా, కన్యాక పరమేశ్వరి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మారుతీ మందిరంలో ..

బోధన్‌రూరల్,జూలై 22 : మారుతీ మందిరంలో సోమవారం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. హుండీ లెక్కింపులో 31,585రూపాయల ఆదాయం భక్తుల ద్వారా లభించినట్లు దేవాదాయ శాఖ అధికారి కమల తెలిపారు. మూడునెలల నుంచి హుండీని సోమవారం తెరిచి లెక్కించడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వేద పండితులు ప్రవీణ్ మహరాజ్, దేవాదాయ శాఖ ఈవో రవీందర్ గుప్తా, జూనియర్ అసిస్టెంట్ రాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సునీల్‌కుమార్

కమ్మర్‌పల్లి, జూలై 22: మండంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన సాగర్ తండ్రి నాగన్న ఇటీవల అనారోగ్యంతో మరుణించడంతో ఆయన కుటుంబాన్ని బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ బుధవారం పరామర్శించి మృతుని కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి, నాయకులు సుంకెట బుచ్చన్న, స్కూరి విజయ్, సిడిసి మాజీ చైర్మన్ కొమ్ముల రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

దారిదోపిడీ కేసులో ముగ్గురికి జైలు

నిజామాబాద్ లీగల్, జూలై 22 : దారి దోపిడీ కేసులో నందిపేట్ మండలానికి చెందిన గుగులోత్ పీర్యా, సుంకరి మహేష్, మూడ్ రాజేష్‌లకు మూడుసంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ అదనపు సహాయక సెషన్స్ జడ్జి శ్రీకాంత్‌బాబు సోమవారం తీర్పుచెప్పారు. 15 డిసెంబర్ 2018న పాల్దా గ్రామానికి చెందిన బూస సౌజన్య తన భర్త రాజు, బంధువు నిర్మలతో బంధువుల వివాహానికి వెళ్లి తిరిగి వస్తూ పోతంగల్ పాల్దా దగ్గర సాయంత్రం ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి వారి మెడలోంచి పుస్తెలతాడు నల్ల పూసాలదండను తెంపుకొని పరారీ అయ్యారు. పారిపోతున్న ఇద్దరిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మూడవ వ్యక్తిని సైతం పోలీసులు పట్టుకొని కోర్టులో హాజరుపర్చగా పోలీసువారి తరపున పీపీ లక్ష్మినర్సయ్య సాక్షాదారాలను రుజువు పర్చగా నిందితులపై అభియోగం రుజువు కావడంతో వారికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానా విధించి తీర్పు చెప్పారు

చంద్రశేఖర్ ఆశయాలకు పునరంకితమవుదాం

● సీపీఐఎంఎల్ మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి

ధర్పల్లి, జూలై 22 : విప్లవ యోధుడు రాయల చంద్రశేఖర్ ఆశయ సాధన కోసం పునరంకితం అవుదామని సీపీఐఎంఎల్ మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి రమేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథ కేంద్ర, రాష్ట్ర కార్యదర్శి, కార్యవర్గసభ్యులు రాయల చంద్రశేఖర్ సంస్మరణ సభను నిర్వహించారు. ధర్పల్లి, సిరికొండ మండలాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంస్మరణ సభలో చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చంద్రశేఖర్ ఆశయసాధనకు కృషి చేద్దామని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దామోదర్, బాబన్న, సాయిరెడ్డి, లింబాద్రి, రమేష్, కిశోర్, ఆశీష్, ఆశన్న, సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్ : విప్లవ పోరాట యోధుడు రాయల చంద్రశేఖర్ ఆశయాలు కొనసాగిద్దామని మాస్‌లైన్ ప్రజాపంథ డివిజన్ నాయకులు ఎస్.సురేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రజాపంథ కేంద్ర నాయకులు, రాష్ట్ర కార్యదర్శి, వర్గసభ్యులు రాయల చంద్రశేఖర్ సంస్మరణ సభను నిర్వహించారు. ఆయన మరణం పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం డివిజన్‌నాయకులు సురేష్ సత్తెవ్వ, అశోక్, జి.కిషన్, దయాల్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రాయల చంద్రశేఖర్ సేవలను వారు వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వర్కర్‌లు, రాజేశ్వరి, నర్సయ్య, పోశన్న, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న కార్యదర్శికి సన్మానం

సిరికొండ జులై 22 : సిరికొండ నుంచి బదిలీపై వెళుతున్న పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌కు సోమవారం యువకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యువకులు శివకుమార్ గురించి ప్రసంగించారు. గత ఏడాది కాలంగా సిరికొండలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న శివకుమార్ అందరి మన్ననలు పొందారు. గ్రామ ప్రజలతో కలుపుగోలుగా ఉంటూ గ్రామంలో ఎవరు ఏ సమస్య చెప్పినా వారికి సంతృప్తికరమైన సమాధానం చెప్పి సమస్య పరిష్కారం కోసం పనిచేశారని యువకులు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కె.సతీష్, మోర్తాడ్ నగేష్,డి.బాబురావు, ప్రేమ్‌కుమార్, సిదురు గంగాధర్, మారుతి, ఎస్.గోపి, కిషన్ తదితరులు ఉన్నారు.

'శిక్షణా తరగతులను వినియోగించుకోవాలి'

ఆర్మూర్‌రూరల్, జులై 22 : శిక్షణా తరగతులలో నేర్చుకున్న అంశాలను అంగన్‌వాడీ టీచర్లు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ సీడీపీవో ఆర్.జ్యోతి అన్నారు. సోమవారం ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఐసీడీఎస్ కార్యాలయంలో మూడురోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు మంచి వాతావరణం కల్పించి చదువు నేర్పించాలన్నారు. దీని ద్వారా మెదడులో నాడికణాలు వృద్ధి చెందుతాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో చార్టులు ఆకర్షణీయంగా ఉంచాలని, కేంద్రాలలో ప్రీ స్కూల్ నమోదు శాతం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ రేఖ, శ్రీదేవి, రాంబాబు, విలాస్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



నగరంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే

పెద్దబజార్, జూలై 22: అర్బన్ నియోజకవర్గ పరిధిలోని అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ చేతుల మీదుగా 44 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న వారిలో 44 మందికి రూ.11లక్షల 94వేల చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. ఎలాంటి పైరవీలు లేకుండా దరఖాస్తు చేసుకునేవారు నేరుగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అన్ని పత్రాలను అందజేస్తే సాధ్యమైనంత వరకు ప్రభుత్వం నుంచి సీఎం సహాయనిధి త్వరగా అందేలా తనవంతు ప్రయత్నిం చేస్తామన్నారు. లబ్ధిదారులకు జారీ విషయంలో జాప్యం జరుగకుండా దరఖాస్తు చేసుకున్న నెలలోపు వచ్చేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అలాగే లబ్ధిదారులకు దరఖాస్తు చేసుకున్న మొత్తంలో 50 శాతం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

'రైతులపై పెట్టిన కేసులను రద్దు చేయాలి'



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పెద్దబజార్, జూలై 22: రైతులపై పెట్టిన కేసులను రద్దు చేయాలని సంయుక్త కిసాన్‌మోర్చ జాతీయ జనరల్‌బాడి నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు అర్వింద్ క్యాంప్ కార్యాలయంలో విజ్ఞాపనపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ 2014లో తమ ఎన్నికల ప్రణాళికలో, 2019 ఎన్నికల్లో రైతాంగాన్ని రెండింతల ధనవంతులను చేస్తామని స్వామినాథన్ కమీషన్ సిఫారసులు అమలు చేస్తామని హామీ ఇవ్వడమేకాకుండా ఎన్నికల ప్రణాళికలో కూడా పేర్కొని రైతులకు మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎస్‌పి గ్యారంటీ చట్టం చేస్తామని స్వామినాథన్ కమీషన్ సిఫారసులు అమలు చేస్తామని అన్నారు. ఉద్యమంలో దాదాపు 756 మంది ప్రాణాలు వదిలారని ఆ కుటుంబాలన్నిటిని ఆదుకుంటామని వ్రాతపూర్వకంగా హామీ ఇచ్చి ఉద్యమాన్ని తాత్కాలికంగా విరమింపజేసిన మోదీ దేశ రైతాంగాన్ని మోసం చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ ఉత్పత్తుల స్వీకరణ, సమగ్ర రుణమాఫీ వెంటనే చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలని తదితర డిమాండ్లతో జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో పెట్టి చర్చించి ఆమోదింపజేసేందుకు దేశవ్యాప్తంగా పార్లమెంట్ సభ్యులకు విజ్ఞాపన పత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చ నాయకులు వి.ప్రభాకర్, వేల్పూర్ భూమయ్య, వెంకటేశ్, దేవరాం, పెద్దివెంకట్రాములు, గంగాధరప్ప, గంగాధర్, సాయిలు, దేశెట్టి సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

● రాంగ్‌రూట్ ప్రయాణం నిషేధం : ట్రాఫిక్ ఏసీపీటీ నారాయణ

ఖిల్లా,జూలై, 22: నగరంలో ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ట్రాఫిక్ ఏసీపీటీ నారాయణ తెలిపారు. పోలీసు కమీషనర్ కల్మేశ్వర్‌శింగేనేవార్ ఆదేశాల మేరకు నగరంలో 18 ప్రాంతాలను గుర్తించామన్నారు. ట్రాఫిక్ ఏసీపీ చాంబర్‌లో సోమవారం అందుకు సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. ప్రజలు రాంగ్‌రూట్‌ల్లో ప్రయాణం చేయడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. వాహనదారులు రాంగ్‌రూట్‌ల్లో, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపరాదని ఆయన తెలిపారు. అలా నడిపితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. నగరంలో ప్రత్యేక బృందాలతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎవరైనా సిగ్నల్ జంప్ చేయడం, రాంగ్‌రూట్‌లో వాహనం నడుపడం చేసినచో వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నగరంలో కుమార్ గల్లీ నుంచి గాంధీ చౌక్, శ్రీదేవి థియేటర్ నుంచి పూసలగల్లీ, పూసలగల్లీ నుంచి మమతపాయింట్ వరకు, ఎల్‌వీఆర్ షాపింగ్‌మాల్ రోడ్ నుంచి మమత పాయింట్ వరకు, ఖలీల్‌వాడి (గౌతమీకళాశాల) నుంచి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వరకు, పాత మనోరమ హాస్పటల్ నుంచి సాయిమెస్, బీఎస్ఎన్ఎల్ వరకు, బీఎస్ఎన్ఎల్ పాయింట్ నుంచి (సౌత్‌ఇండియా షాపింగ్‌మాల్) నుంచి హరిచరణ్ మార్వాడి కళాశాల వరకు, పోలీసు కమీషనరేట్ నుంచి నిషితా కళాశాల, జడ్పీ కార్యాలయం నుంచి డీఐజీ కార్యాలయం రబ్ మీదుగా, కంఠేశ్వర్ జంక్షన్ నుంచి కంఠేశ్వర్ శివాలయం వరకు, గూపన్‌పల్లి కమాన్ నుంచి కృష్ణ మందిర్ టెంపుల్, మారుతినగర్ వరకు, శ్రీరామగార్డెన్ ఫంక్షన్‌హాల్ నుంచి గంగాస్థాన్ ఫేస్-2వరకు, ఎల్లమ్మగుట్ట (మనోరమ ఆస్పత్రి)నుంచి ప్రగతి హాస్పిటల్ వరకు, ఇండియన్ ఆయిల్ పెట్రోల్‌బంక్(వంశీహోటల్ ఎదురుగా) నుంచి పులాంగ్ చౌరస్తా వరకు, పాస్‌పోర్ట్ కార్యాలయం నుంచి ప్రగతి ఆస్పత్రి వరకు, ఇండియన్ పెట్రోల్‌బంక్ నుంచి ఆర్‌ఆర్ చౌరస్తా వరకు, మాలపల్లి చౌరస్తా నుంచి బోధన్ రోడ్డు రెండువైపులా ప్రాంతాలను గుర్తించామన్నారు. ప్రజలు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖకు సహకరించి నిబంధనల మేరకు వాహనాలు నడుపాలని ఆయన సూచించారు. ఈవిలేకరుల సమావేశంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, తదితరులు

నిజామాబాద్ అర్బన్, జూలై 22: ప్రతీ సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఈ వారం 91 ఫిర్యాదులు వచ్చాయి. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమీషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, డీఆర్‌డీవో సాయాగౌడ్‌లు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ ఫిర్యాదుదారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ పాఠశాలలకు అటెండర్లను తిరిగి కేటాయించాలి...

జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి ఆఫీస్ సబార్డినెంట్‌లను బదిలీ చేశారని తిరిగి వారిని కేటాయించాలని కోరుతూ గెజిటెడ్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా పరిషత్ పాఠశాలలో పనిచేస్తున్న ఆఫీస్ సబార్డినెంట్లను బదిలీ చేసి వారి స్థానంలో ఎవరిని కేటాయించలేదని దీని వల్ల ఎక్కువ విద్యార్థుల సంఖ్య, ఎక్కువ తరగతి గదులు, కాంప్లెక్స్ పాఠశాలల నిర్వహణ అస్తవ్యస్థమయ్యే అవకాశం ఉందని వారు తెలిపారు. గత నాలు గేళ్లుగా స్కావెంజర్లను ఇవ్వకపోవడం వల్ల పాఠశాలల్లో పారిశుద్ధ్యం పూర్తిగా దెబ్బతిందని ఇప్పుడు అటెండర్లను బదిలీ చేసి ఎవరిని కేటాయించకపోవడం వల్ల పాఠశాలల్లో ఊడ్చేవారు, తాళాలు వేసేవారు ఉండరని దీనివల్ల ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని కావున వెంటనే బదిలీ అయిన వారిని తిరిగి కేటాయించాలని లేదా మరొకరిని ఖాళీ అయిన స్థానాల్లో భర్తీ చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షుడు మోహన్, లక్ష్మినర్సయ్య, కోశాధికారి దృష్టికుమార్, తదితరులు ఉన్నారు.

● ముదిరాజ్‌ల సమస్యలను పరిష్కరించాలి

సుప్రీం కోర్టు ఆదేశించిన ఆదేశాలకు ముదిరాజ్‌లను బీసీఏలోకి మార్చు చేయాలని కోరుతూ ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మత్స్యకారుల సహకార సంఘాలలో సభ్యత్వం ఇవ్వాలని ముదిరాజ్ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి సబ్సిడీ మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా ఈ అంశాన్ని నిజామాబాద్‌కు చెందిన ఎమ్మెల్యేలు అసెంబ్లీలో చర్చించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

● దుబ్బ పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి

నగరంలోని దుబ్బ ప్రభుత్వ పాఠశాలలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ప్రతినిధులు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. పాఠశాలలో 463 మంది విద్యార్థులు చదువుతుండగా సరైన తరగతి గదులు లేవని కావున వెంటనే తరగతి గదులను ఏర్పాటు చేయాలని అదేవిధంగా మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విఘ్నేష్, రాజు, వినిత్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంపదను సంరక్షించుకోవాలి : రూరల్ ఎమ్మెల్యే

ఇందల్వాయి, జూలై 22: 75వ వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఇందల్వాయి మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని అన్సాన్‌పల్లి ఆర్‌ఎఫ్ కంపార్ట్‌మెంట్‌లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన మహోత్సవ కార్యక్రమం 1950 సంవత్సరంలో ప్రారంభమైందని 75 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో ఈ వనమహోత్సవం కార్యక్రమానికి వజ్రోత్సవ వనమహోత్సవంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నామకరణం చేసి కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా అటవీశాఖ అధికారులతో కలిసి మొక్కలు నాటి అనంతరం రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతీ ఒక్కరు అటవీ సంపదను పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. ప్రతీ ఇంటికి ఐదు మొక్కలు చొప్పున నాటి వాటిని సంరక్షించాలని ప్రజలను కోరారు. అనవసరంగా ఎవరూ కూడా చెట్లను నరకవద్దని సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఒక చెట్టును నరకాల్సి వస్తే బదులుగా ఐదు మొక్కలు నాటాలని ఆయన ప్రజలకు సూచించారు. వంట చేసేందుకు చెట్లను నరకవద్దని పెద్ద పెద్ద చెట్లను నరికి వ్యవసాయ భూములు తయారు చేసేందుకు ఎంతో విలువైన అటవీ సంపదను ధ్వంసం చేస్తున్నారని చట్టవిరుద్ధమని సూచించారు. ప్రతీ ఒక్కరూ చెట్ల పెంపకం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇందల్వాయి రేంజ్ అధికారి రవిమోహన్‌భట్, డిప్యూటీ రేంజ్ అధికారి అసీఫొద్దీన్, అధికారులు బాబురావు, సుబ్బారావు, రాజేశ్వర్, తహసీల్దార్ వెంకట్రావు, ఎంపీడీవో అనంత్‌రావు, ఎంపీవో రాజ్‌కాంత్, ఆర్ఐ మోహన్, అటవీశాఖ సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, గంగాధర్, ఆనంద్, సంతోష్‌రెడ్డి, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



మొక్కలు నాటుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

కల్యాణలక్ష్మీ, షాదీముబారక్‌తో పేదలకు లబ్ధి



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, జూలై22: కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకంతో పేద, మధ్య తరగతి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. సోమవారం ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలోనిరైతు వేదికలో ఆర్మూర్, ఆలూర్ మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ కల్యాణలక్ష్మీ మంచి పథకం అని ఈపథకాన్ని ప్రారంభించిన కేసీఆర్ అభినందనీయుడన్నారు. ఎవరున్న లేకపోయిన సంక్షేమ పథకాలు కొనసాగుతునే ఉంటాయన్నారు. గత ప్రభుత్వంలో బాన్సువాడ నియో జకవర్గానికి పది వేల ఇళ్లు మంజూరు చేసి పూర్తి చేశారని, ఆర్మూర్ నియోజకవర్గంలో ఒక్కటి కూడా పూర్తి కాలేదని ఇదేక్కడి న్యాయమని ప్రశ్నించారు. అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ మున్న, గోవింద్‌పేట్ ఎంపీటీసీ రాజ్‌కుమార్, ఆర్మూర్, ఆలూర్ మండలాల బీజేపీ అధ్యక్షుడు రోహిత్‌రెడ్డి, కొత్తూరు గంగాధర్, బీజేపీ నాయకులు ఆలశ్రీనివాస్,రంగన్న, వేణు,కౌన్సిలర్ తదితరులు పాల్గొన్నారు.

● ముదిరాజ్‌లను బీసీ(ఏ)లోకి మార్చాలని వినతి

ముదిరాజ్ కులస్థులను బీసీ(బీ)లో నంచి బీసీ(ఏ)లోకి మార్చాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్ సోమవారం ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ముదిరాజ్‌ల సమస్య పరిష్కరానికి చొరవ చూపాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజేశ్వర, ఉపాధ్య క్షుడు ఎర్రన్న, మురళీ, తదితరులు పాల్గొన్నారు. అసెంబ్లీ సమావేశంలో ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వారు కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మహిళ అదృశ్యం

ఖిల్లా, జూలై 22: జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మహిళ అదృశ్యమైనట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో డి.విజయ్‌బాబు తెలిపారు. బాల్కొండ మండల కేంద్రానికి చెందిన సకినా అనే మహిళ తన కూతురు డెలివరీ నిమిత్తం ఈనెల 2వ తేదీన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. 4వ తేదీన సాయంత్రం 4గంటలకు టీ తీసుకొని వస్తానని చెప్పి వెళ్లి ఆమె ఇంతవరకు ఆసుపత్రికి చేరుకోలేదని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె కోసం కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లల్లో వెతికిన ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు.

విద్యుత్ ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

సుభాష్‌నగర్, జూలై 22: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం టీజీఎన్‌పీడీసీఎల్ ప్రవేశపెట్టిన విద్యుత్ ప్రజావాణికి వినతులు వెల్లువలా వచ్చాయి.వివిధ డివిజన్‌లలో ఏడీఈ, ఏఈ కార్యాలయాల్లో వినియోగదారులు తమ వినతులను అందజేశారు. మొత్తం నాలుగు డివిజన్‌లలో 111 ఫిర్యాదు రాగా అందులో 93 వినతులను వెంటనే పరిష్కరించారు. 18 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నట్లు టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రవీందర్ తెలిపారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలో 52 ఫిర్యాదులు నమోదు కాగా 44 ఫిర్యాదులను వెంటనే పరిష్కరించారు. 8 ఫిర్యాదులను త్వరలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఆర్మూర్ పరిధిలో 15 ఫిర్యాదులు నమోదు కాగా 10 ఫిర్యాదులను పరిష్కరించారు. డిచ్‌పల్లి పరిధిలో 22, బోధన్ పరిధిలో 22ఫిర్యాదులు నమోదు అయ్యాయి. విద్యుత్ వినియోగదారులు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈ రవీందర్ కోరారు.

ఇద్దరు దొంగల రిమాండ్

బోధన్‌రూరల్,జూలై22: మండలంలోని సాలంపాడ్ గ్రామంలో కోట శ్రావణ్ రెడ్డి ఇంట్లో ఫిబ్రవరి నెలలో దొంగతనం జరిగిన కేసులో సోమవారం ఇద్దరు దొంగలను గుర్తించి కోర్టు రిమాండ్‌కు తరలించినట్లు బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు. ఆదివారం రాత్రి వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు పారిపోతుండగా వెంబడించి పట్టుకుని విచారించగా వారిని దొంగలుగా గుర్తించి విచారణ చేపట్టగా కోట శ్రావణ్ రెడ్డి ఇంట్లో చోరీకి పాల్పడ్డామని ఒప్పుకున్నారని తెలిపారు. మహరాష్ట్రకు చెందిన గోపి, సుంకినికి చెందిన చాకలి రాజులు దొంగతనం చేశారని, నేరం ఒప్పుకోగా వారిని కోర్టు రిమాండ్ చేసినట్లు ఆయన తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ఖిల్లా, జూలై 22: నగరంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.5వేల 8వందల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎల్.రామ్ తెలిపారు. ఖచ్చితమైన సమాచారం మేరకు శివాజీనగర్‌లో పేకాటాడుతున్న వారిపై తన సిబ్బందితో దాడి చేశామన్నారు. వీరిపై కేసునమోదు చేశామన్నారు.

బాధ్యతలు చేపట్టిన కార్యదర్శులు

ఏర్గట్ల, జూలై 22: మండలంలోని దోంచంద, గుమ్మిర్యాల్, తడపాకల్ గ్రామా ల్లోని కార్యదర్శులు ఇటీవలే బదిలీపై వెళ్ళగా సోమవారం దోంచంద గణేష్, గుమ్మిర్యాల్ రామకృష్ణ, తడపాకల్ రాకేష్‌లు కార్యదర్శులుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శివచ రణ్, కార్యదర్శి జాకీర్ హుస్సేన్‌లు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

నవీపేట,జూలై22: మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు బదిలీలు జరిగాయని ఎంపీడీవో నాగనాథ్ తెలిపారు. వివిధ గ్రామాలలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు కలెక్టర్ ఉత్తర్వుల మేరకు స్థానచలనం జరిగిందని ఆయన పేర్కొన్నారు. డీ.స్వర్ణలత(లింగాపూర్), ఎస్.కళ్యాణి(రాంపూర్), ఏ.హరీష్(మిట్టాపూర్), కే.మమత(ఫత్తేనగర్), కే.శ్రావణ్ కుమార్(మద్దెపల్లి), ఎస్‌కే.కాలేషా(నాడాపూర్), సయ్యద్ మసూద్(శివతండా), ఆర్.చంద్రకాంత్(మోకన్‌పల్లి), టీ.నాగరాజు(నందిగాం), ఎస్.రాజ్‌కుమార్(నిజాంపూర్), డీ.సాయి సచిన్(మట్టయ్య ఫారం తండా), డీ.సుభాష్(ధర్మారం), వై.రాజేష్(కోస్లీ), డీ.సునీత(అబ్బాపూర్(ఎం), జే.అఖిల్ కుమార్(అభంగపట్నం) పంచాయతీ కార్యదర్శులుగా బదిలీ అయ్యారని ఆయన పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులుగా బదిలీ అయిన వారు మంగళవారం లోగా ఆయా గ్రామ పంచాయతీలలో బాధ్యతలు స్వీకరించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

బోధన్ మున్సిపాలిటీలో అధికారుల బదిలీలు

బోధన్‌రూరల్,జూలై22: బోధన్ పట్టణంలోని మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న 11మంది అధికారులు బదిలీ అయ్యారు. మున్సిపల్ మేనేజర్ నరేందర్ భీంగల్ మున్సిపాలిటీకి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శంకర్ ఆదిలాబాద్‌కు బదిలీ అయ్యారు. జూనియన్ అసిస్టెంట్‌లు నలుగురు, సీనియర్ అసిస్టెంట్‌లు ముగ్గురు, బిల్ కలెక్టర్‌లు ఇద్దరు నిజామాబాద్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు.

● ఆర్మూర్ మున్సిపల్‌లో ఏడుగురు ఉద్యోగుల బదిలీలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో పని చేస్తున్న ఏడుగురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా బదిలీల ప్రక్రియ కొనసాగడంతో మున్సిపల్ మేనేజర్ యాదవ్‌కృష్ణ ఆదిలాబాద్‌కు, రెవెన్యూ ఆఫీసర్ మనోహర్‌ను ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్‌కు, సానిటరి ఇన్‌స్పెక్టార్ మహేష్‌కుమార్‌ను నిజామాబాద్ మున్సిపల్‌కు, జూనియర్ అసిస్టెంట్‌లు ప్రసన్న, హేమలత, రాజేశ్వరీలను నిజామాబాద్ మున్సిపల్‌కు, బిల్ కలెక్టర్ సుశీలను బోధన్‌కు బదిలీ అయ్యారని కమిషనర్ రాజు తెలిపారు.

పసుపు లారీని దారి మళ్లించిన వ్యక్తి రిమాండ్

ఖిల్లా, జూలై 22: పసుపు లోడ్‌తో ఉన్న లారీని దారి మళ్లించిన వ్యక్తి షేక్ తోఫిక్ అలీని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో డి.విజయ్‌బాబు తెలిపారు. అదేవిధంగా రూ.40లక్షల విలువ చేసే లారీని, రూ.30లక్షల విలువ చేసే పసుపును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రం నుంచి గుంటూరుకు పసుపు లోడ్‌తో బయలుదేరిన లారీని ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద దారిమళ్లించి అందులో ఉన్న పసుపును అమ్ముకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. మిగతా వారి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

నలుగురిని రక్షించిన పోలీసులు



మహిళను కాపాడిన పోలీసులు

బాసర,జూలై,22:కుటుంబ కలహాల కారణాలతో ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చిన ఓమహిళను సోమవారం బాసర పోలీసులు కాపాడారు.మరో ఘటనలో ఇంటి నుంచి చెప్పకుండా వచ్చిన బాలున్ని క్షేమంగా ఇంటికి చేర్చారు. రెండు వేరువేరు ఘటనలకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం శాంతినగర్‌కు చెందిన ఓ మహిళ కుటుంబ కలహాలతో ఐదు సంవత్సరాలలోపు ఉన్న ఇద్దరు పిల్లలను వెంటబెట్టుకొని బాసర వచ్చారు. బాసర రైల్వే స్టేషన్‌లో అనుమా నస్పదంగా తిరుగుతుండడంతో స్థానికులు 100 కు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు వచ్చి ఇద్దరు పిల్లలతో ఉన్న మహిళను స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చారు. కుటుంబంలో భర్తతో పాటు కుటుంబసభ్యులు ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు భరించలేకేఆత్మహత్య చేసుకునేందుకు వచ్చినట్లు సదరు మహిళ పోలీసులతో చెప్పారు. కుటుంబ సభ్యులను పిలి పించి కౌన్సిలింగ్ ఇచ్చి పోలీసులు పంపించారు. ఆదివారం రాత్రి నిఖిల్ అనే బాలుడు బాసర రైల్వేస్టేషన్‌లో ఒంటరిగా కనిపించడం తో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఆదివారం రాత్రంతా బాలున్ని క్షేమంగా ఉంచుకొని సోమ వారం ఉదయం తల్లి దండ్రులకు అప్పగించారు.రెండుఘటనల్లో నలుగురిని కాపాడిన బాసర పోలీసులను స్థానికుల నుంచి ప్రశంసలు వ్యక్తమయ్యాయి.

ఒలింపిక్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలో విజేతలు వీరే

సుభాష్‌నగర్, జూలై 22: ఒలింపిక్ క్రీడల నేపథ్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన ఆన్‌లైన్ క్విజ్ పోటీలో జిల్లా నుంచి పది మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారని ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య తెలిపారు. నిజామాబాద్ జిల్లా నుంచి వందల మంది విద్యార్థులు ఆన్‌లైన్ క్విజ్ పోటీలో పాల్గొనగా పది మంది టాప్-10 విద్యార్థులను ఎంపిక చేశారు. విజేతలుగా స్పందన, సహస్ర, మాలతి, విద్య, వాణి, తిరుమల, చిన్మయి, మనీ షా, మనితేజ, వేణుమాదవ్ నిలిచారు. విజేతలకు త్వరలో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

ఇంటిగ్రేటెడ్ పీజీ సెమిస్టర్ పరీక్షల్లో 13 మంది గైర్హాజరు

డిచ్‌పల్లి,జూలై 22: విశ్వవిద్యాలయం పరిధిలోని పీజీ ఇంటి గ్రేటెడ్ ఏపీఈ, ఐపీసీహెచ్, ఐఎంబీఏ 6,8,10వ సెమిస్టర్, ఎల్ ఎల్‌బీ 6, ఎంబీఏ,ఎంసీఏ 1,3వ సెమిస్టర్, ఐఎంబీఏ7,9 వసెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లగ్ పరీక్షలు సోమవారం 6వ రోజు ప్రశాంతంగా జరిగాయని ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు.ఆర్ట్స్ కళాశాల,న్యాయ కళాశాలలో జరిగిన పరీక్షల్లో 14మంది విద్యా రులకు గాను 14మంది పరీక్షకు హాజరయ్యారని ఆడిట్‌సెల్ డైరెక్టర్ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 89మంది విద్యార్థులకు 76విద్యార్థులు హాజరయ్యారని, 13మంది గైర్హాజరయ్యారని డై రెక్టర్ పేర్కొన్నారు.

నందిపేటలో దాశరథి 99వ జయంతి వేడుకలు



దాశరథి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

నందిపేట,జూలై22: మండల కేంద్రంలోని నంది విగ్రహం చౌరస్తాలో జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం దాశరథికృష్ణమ చార్య 99వ జయంతి వేడుకల ను నిర్వహించారు.ఈసందర్భంగా జేఏసీ కన్వీనర్ కె.గంగాధర్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తెలంగాణ సాహిత్యానికి ఎనలేని కృషి చేసిన రచయిత అని దాశరథి అని పేర్కొన్నారు. నిజాం ప్రభువుకు వ్యతిరేకంగా పోరాడి నిజామాబాద్ ఖిల్లా జైల్లో అనేక రచనలు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీసభ్యులు సిలిండర్‌లింగం, బాలగంగాధర్, మండల కోఆప్షన్ మాజీ సభ్యులు సయ్యద్‌హుస్సెన్, నాయకులు నర్సింగ్‌రావు, అభి, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: తెలంగాణలో సాహిత్య కుసుమం దాశరథి కృష్ణామాచార్యుని జయంతి ఉత్సవాన్ని సిరికొండలో ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైని సిరికొండలో సత్యాశోధక్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో దాశరథి జయంతిని నిర్వహించారు.మొదట ఆయన చిత్రపటానికి సొసైటీ అధ్యక్షుడు ఆర్.నర్సయ్య పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిజామాబాద్ లీగల్: దాశరథి కృష్ణమాచార్య శతజయంతి సందర్భంగా నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు జగన్మోహన్‌గౌడ్ మాట్లాడుతూ దాశరథి కవిగా, రచయితగా, హైదరాబాద్ సంస్థాన పోరాట యోధుడిగా, సాహితీకారుడిగా బహుముఖ సేవలు అందించారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి ప్రేరణగా నిలిచిన పద్యగేయం కోటి రతనాల వీణ నా తెలంగాణ దాశరథి నిజాం పాలనకాలంలో జైలు శిక్ష అనుభవించిన నిజామాబాద్ జైలు గోడలపైనేనని అన్నారు. తెలుగు నేలపై సాహితీ సుమాలు వెదజల్లి ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లోని జనజీవనంలో మమేకమై సాహితీమూర్తిగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో బార్ ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, కార్యదర్శి సురేష్, కోశాధికారి దీపక్, న్యాయవాదులు రాజ్‌కుమార్ సుబేదార్, పరుచూరి శ్రీధర్, మాజీ పీపీ మధుసూదన్‌రావు, సుదర్శన్‌రావు, ఆశనారాయణ, స్నేహ, రవి, నారాయణ, నిశాంత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.100	రూ.220	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.105	రూ.225	రూ. 245

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.74200	రూ.68,400	రూ.930

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : కల్కి(3డి తెలుగు) (11.00, 6.30)
: భారతీయుడు-2 (2.45)
: ట్విస్టర్స్ : (ఇంగ్లీష్) (10.15)

స్క్రీన్-2 : బ్యాడ్ న్యూజ్ (హిందీ) (10.45, 1.50, 7.25, 10.30)
: కిల్ (హిందీ) (4.55)

స్క్రీన్-3 : ట్విస్టర్స్ : (ఇంగ్లీష్) (10.15)
: డార్లింగ్ (1.05, 7.00, 10.20)
: జస్ట్ ఎ మినట్ (4.25)

స్క్రీన్-4 : డార్లింగ్ (10.40)
: ట్విస్టర్స్ : (ఇంగ్లీష్) (2.00, 7.30)
: ది బర్త్‌డే బాయ్ (4.50)
: పేక మేడలు (10.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కల్కి(తెలుగు) (12.35, 4.00, 7.25)
: డార్లింగ్ (10.50)

స్క్రీన్-2 : భారతీయుడు-2 (4.20, 10.45)
: కల్కి(తెలుగు) (10.00)

స్క్రీన్-3: కల్కి(తెలుగు) (10.50)
: భారతీయుడు-2 (1.00, 7.20)
: డార్లింగ్ (4.25)

దేవి : భారతీయుడు-2 (11.15, 2.15, 6.15, 9.15)

నటరాజ్ : క్రైమ్ రీల్ (11.15, 2.15, 6.15, 9.15)

విజయ్ : కల్కి (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్